www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 5 డిసెంబర్ 2025

5

తూర్పుగోదావరి



13న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

ఈ నెల 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నటు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ ఎన్.శ్రీలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు త్వరిత, తక్కువ ఖర్చుతో, సులభ న్యాయం అందించడమే లోక్ అదాలత్ లక్ష్యమని వెల్లడించారు. చిట్‌ఫండ్ సంస్థలకు సంబంధించిన సివిల్, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, రాజీ పడతగిన ఇతర కేసులను జాబితా చేసి లోక్ అదాలత్‌లో పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని సంబంధిత విభాగాలకు ఆదేశాలు జారీ చేశామన్నారు. బాధితులకు తగిన పరిహారం, న్యాయ సేవలందించడంలో లోక్ అదాలత్‌లు కీలకపాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ఈ రాజీ పరిష్కారంతో సమాజంలో సౌహార్ద వాతావరణం నెలకొంటుందని ఆమె వివరించారు.

ఆశలన్నీ సీలేరు పైనే..!

ఈ ఏడాది రబీ సాగులో రైతులకు సాగునీటి కష్టాలు తప్పేటట్లు లేవు. గోదావరిలో సాగునీటి లభ్యత ఆందోళనకరంగా ఉంది. ఎన్నడూ లేని విధంగా డిసెంబర్ నెలలోనే గోదావరిలో ఇసుక మేటలు బయట పడ్డాయి. ధవళేశ్వరం ఆనకట్టకు ఎగువ భాగంలో భారీగా ఇసుక మేటలు పేరు కుపోయాయి. ఆనకట్టకు కేవలం 500 మీటర్ల దూరంలోనే నదిలో పలుచోట్ల రెండు మూడు అడుగులు లోతు మాత్రమే నీరు ఉంది. కొవ్వూరు రోడ్డు కం రైలు వంతెన వద్ద పూర్తిగా నీరు తగ్గిపోవడంతో గోదావరిలో ఇసుక మేటలు దర్శనమిస్తున్నాయి. ఇటువైపు నుంచి అవతలి వద్దు వరకు నడిచి వెళ్లిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి.



కాటన్ బ్యారేజీ ఎగువన గోదావరి నదిలో కనిపిస్తున్న ఇసుక మేటలు

- రబీకి తప్పని సాగునీటి కష్టాలు
- 93.26 టిఎంసిల సాగునీరు అవసరం
- అందుబాటులో 73.36 టిఎంసిలే
- 19.90 టిఎంసిల కొరత
- నీటి పొదుపు చర్యలపై అధికారుల దృష్టి

ప్రజాశక్తి - కొవ్వూరు

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో గోదావరి డెల్టా ఆయకట్టులో 8,96,507 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉందని అధికారులు లెక్కలు వేశారు. ఈ సీజన్‌లో సాగునీటి అవసరాల నిమిత్తం 86.04 టిఎంసిలు, పరిశ్రమలు, తాగునీటి అవసరాల నిమిత్తం 7.22 టిఎంసిల నీరు అవసరమని అధికారులు లెక్కలు వేశారు. ఈ రబీ సీజన్‌లో మొత్తం 93.26 టిఎంసిల నీరు అవసరమని జల వనరుల శాఖ అధికారులు తేల్చారు.

19.90 టిఎంసిల కొరత

ఏడాది రవి సీజన్లో గోదావరిలో సహజ జలాల రూపంలో 9.45 టిఎంసిల నీరు అందుబాటులో ఉంటుందని అంచనా వేశారు. పోలవరం ప్రాజెక్టు ద్వారా 20 టిఎంసిల నీరు, సీలేరు జలాశయం ద్వారా 43.91 టిఎంసిల నీరు అందుబాటులో ఉంటుందని లెక్కలు వేశారు. మొత్తం 73.36 టిఎంసిల నీరు అందుబాటులో ఉంటుందని లెక్కలు వేశారు. ఈ లెక్కన 19.90 టిఎంసిల నీరు రబీ సీజన్‌లో కొరత ఉంటుందని అంచనా వేశారు.

సీలేరు జలాలే దిక్కు

సీలేరు నుంచి రోజుకి 4,200 క్యూసెక్కుల చొప్పున సాగు నీరు అందుతుందని జలవనుల శాఖ అధికారులు చెబుతున్నారు.



సీలేరు రిజర్వాయర్

రబీ సీజన్ గోదావరి నీటి లభ్యత వివరాలు

గోదావరి డెల్టా ఆయకట్టు	: 8,96,507 ఎకరాలు
రబీలో అవసరమైన సాగునీరు	: 86.04 టిఎంసిలు
తాగునీరు, పరిశ్రమలు అవసరమైన నీరు	: 7.22 టిఎంసిలు
మొత్తం రబీకి అవసరమైన నీరు	: 93.26 టిఎంసిలు
గోదారిలో సహజ జలాల ద్వారా	: 9.45 టిఎంసిలు
పోలవరం ప్రాజెక్టు నుంచి	: 20 టిఎంసిలు
సీలేరు ద్వారా లభ్యమయ్యే సాగునీరు	: 43.91 టిఎంసిలు
ఇంకా అవసరమైన నీరు	:19.90 టిఎంసిలు

43.91 టిఎంసిల నీటిని గోదావరి డెల్టాకు విడుదల చేసేందుకు అంగీకరించినట్టు అధికారులు చెబుతున్నారు. ఈ సీజన్‌లో సీలేరు జలాశయానికి సుమారు 70 టిఎంసిలు నీరు అందుబాటులో ఉండొచ్చని అంచనా వేశారు. రబీ సీజన్‌లో కొరత వచ్చే జలాలను సీలేరు ద్వారా సర్దుబాటు చేయాలని అధికారులు యోచిస్తున్నారు. రెండు నెలల పాటు సీలేరు కాంప్లెక్స్ పరిధిలో ఉండే పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి నీటి సరఫరా చేసే డొంకరాయి పవర్ కెనాల్‌కు నీటి సరఫరా రెండు నెలలపాటు నిలిపివేస్తున్నట్లు ఎపి జెన్‌కో ఛీఫ్ ఇంజినీర్ కెవి.రాజారావు ప్రకటించారు. దీంతో రానున్న రెండు నెలలు సీలేరు నుంచి అనుకున్న స్థాయిలో నీరు వచ్చే అవకాశం కన్పించడం లేదు. సీజన్ ప్రారంభంలోనే గోదావరిలో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి.

నీటి పొదుపు చర్యలే శరణ్యం

ఈ ఏడాది రబీ సీజన్‌లో రైతుల పంటలు గొట్టెక్కాలంటే నీటి పొదుపు చర్యలే శరణ్యమని అధికారులు భావిస్తున్నారు. పలుచోట్ల మురుగు కాలువలకు అడ్డుకట్టలు, ఆయిల్ ఇంజన్ల సాయంతో శివారు ప్రాంతాలకు సాగునీరు సరఫరా చేయాల్సి ఉంది. కోనసీమ జిల్లా పరిధిలోని సెంట్రల్ డెల్టాకు సాగునీటి కష్టాలు తీర్చేందుకు రూ.2.5 కోట్ల తో అధికారులు ప్రతిపాదన పంపారు. ఏలూరు జిల్లా పరిధిలో పశ్చిమ డెల్టా కాలువ నీటి పొదుపు జల్లు నిమిత్తం రూ.56,199 ప్రతిపాదనలు పంపారు. పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో పశ్చిమ డెల్టా కాలువకు రూ.2 కోట్లతో ప్రతిపాదన పంపించారు. వీటికి తోడు నీటి పొదుపు చర్యలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ నిమిత్తం ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలోని మూడు డెల్టాలకు 610 తాత్కాలిక లస్కర్లను నియమించారు.



గోదావరి తూర్పు డెల్టా కాలువకు విడుదలవుతున్న నీరు

నీటి పొదుపు చర్యలు పాటించాలి

రబీ సీజన్‌లో గోదావరి డెల్టా ఆయకట్టు రైతులు నీటి పొదుపు చర్యలు పాటించాలి. సెంట్రల్ డెల్టాకు నీటి పొదుపు చర్యలు నిమిత్తం రూ.2.5 కోట్ల అంచనాతో ప్రతిపాదన పంపించాం. వీటితో ఆయిల్ ఇంజన్లు ఏర్పాటు, మురుగు కాలువలకు అడ్డుకట్టలు తదితర పనులు చేపడతాం. రబీ పంట గట్టెక్కాలంటే 19.90 టిఎంసిల నీరు అదనంగా అవసరం ఉంది. సీలేరులో ఎగువ ప్రాజెక్టులతో కలిపి 70 టిఎంసిలు వరకు నీరు అందుబాటులో ఉంటుందని అంచనా. దీనిలో 43.91 టిఎంసిలు సీలేరు నుంచి ఇచ్చేందుకు అంగీకరించారు. నీటి కొరతకు ఆస్కారం లేకుండా సీలేరు ద్వారా అవసరమైన నీటిని తీసుకునేందుకు చర్యలు తీసుకుంటాం.

-కె.గోపీనాథ్, ఎస్ఇ, గోదావరి హెడ్ వర్క్స్, ధవళేశ్వరం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న మంత్రి కందుల దుర్గేష్, ఎంఎల్‌సి సోము వీర్రాజు, ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ

చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

రాష్ట్రంలో చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధికి కషి చేస్తామని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. గురువారం రాజమహేంద్రవరంలోని ప్రసాదిత్య మాల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సారథి సినిమాస్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి దుర్గేష్ పాల్గొన్నారు. రాజమహేంద్రవరం నగరం పర్యాటకం, సంస్కృతి మరియు వినోద రంగాల్లో మరింత అభివృద్ధి చెందేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఎపిలో సినిమా రంగ అభివృద్ధికి తొలిమెట్టుగా ప్రసాదిత్యమాల్‌ను భావిస్తున్నామన్నారు. రాష్ట్రంలో చలనచిత్ర అభివృద్ధికి అవసరమైన స్టూడియోలు, రీరికార్డింగ్ థియేటర్లు, డబ్బింగ్ థియేటర్లు తదితర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్న ఆలోచనలో ఉన్న క్రమంలో సారథి సినిమాస్‌తో ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. ఎపిలో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలో కొత్త ఫిల్మ్ పాలసీ తీసుకొస్తున్నామని అన్నారు. ఈ క్రమంలో సినిమా రంగ పురోగతికి అవసరమైన అనేక విభాగాలు ఏపీకి రావాలని కోరుకుంటున్నామని తెలిపారు. సినిమా రంగ ఉన్నతికి అన్ని విధాల అండగా ఉంటామని మంత్రి దుర్గేష్ భరోసానిచ్చారు. రాజమహేంద్రవరం నగరంలో అత్యాధునిక టెక్నాలజీతో కూడిన మల్టీప్లెక్స్ ఏర్పాటు కావడం శుభ పరిణామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి సోము వీర్రాజు, ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా పేరెంట్స్ మీట్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

జిల్లావ్యాప్తంగా శుక్రవారం మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌ను విద్యాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు డిఇఒ కె.వాసుదేవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 7 నియోజక వర్గాలు, 2 రెవెన్యూ డివిజన్లు, 19 మండలాల్లో కలిపి 1,570 పాఠశాలల్లో ఈ సమావేశాలు జరుగుతున్నాయన్నారు. వీటిలో 984 ప్రభుత్వ పాఠశాలలు, 586 ప్రయివేటు పాఠశాలలలో 2,37,754 మంది విద్యార్థులతో, వారి తల్లితండ్రుల, సంరక్షకులతో కలిసి మెగా పేరెంట్ టీచర్స్ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 93,399, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు 1,44,355 మంది పాల్గొన నున్నారన్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు, వ్యక్తిగత వికాసం పట్ల తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో ఈ సమావేశాలను చేపట్టినట్లు ఆయన తెలిపారు. హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు పంపిణీ, విద్యార్థుల ప్రదర్శనలు, వ్యక్తిగత అంచనాలు, పాఠశాల-సమాజ అనుసంధానాన్ని బలోపేతం చేసే అంశాలతో కార్యక్రమాలు అమలు చేయనున్నట్లు చెప్పారు. ఈ సమావేశాల్లో జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.



కలెక్టర్‌కు మొక్కను ఇస్తున్న బాధితురాలు

కలెక్టర్ చొరవతో స్వగ్రామానికి మహిళ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

నకిలీ ఏజెంట్ చేత మోసపోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఒక మహిళ కలెక్టర్ కీర్తి చేకూరి చొరవతో స్వస్థలానికి చేరుకుంది. వివరాల్లోకి వెళితే...కొవ్వూరు మండలం దారావరం గ్రామానికి చెందిన షైక్ నాగూర్ బేబీ నకిలీ ఏజెంట్ చెప్పిన తప్పుడు హామీలకు నమ్మి దుబాయ్ వెళ్లింది. ఆమె అక్కడ పని భరించలేనంత ఒత్తిడులు, ఆరోగ్య సమస్యలు ఎదుర్కొని తీవ్రంగా ఇబ్బందులు పడింది. కుటుంబ సభ్యులు కలెక్టర్ కీర్తి చేకూరిని కలిసి ఆమె ఇబ్బందులను వివరించారు. వెంటనే ఆమె స్పందించి వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.లచ్చారావు సంబంధిత ఏజెంట్, అధికారులతో సంప్రదిం పులు జరిపి ఆమెను భారత్‌కు క్షేమంగా రప్పించే చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే ఇంటికి చేరుకున్న నాగూర్‌బేబి తన కుటుంబ సభ్యులతో గురువారం కలెక్టర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విదేశాల్లో ఉపాధి కోసం ప్రయత్నించే యువత, మహిళలు నకిలీ ఏజెంట్ల మాయ మాటలకు లోను కావద్దని సూచించారు. అధికారిక ఛానెల్స్ ద్వారానే విదేశాలలో ఉపాధి అవకాశాలపై సంప్రదింపులు జరపాలని అన్నారు. ఈ కార్యక్ర మంలో వికాస పీడీ కె.లచ్చారావు పాల్గొన్నారు.

దోబీఖానాల నిర్మాణానికి కృషి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

అత్యాధునిక విధానాలతో దోబీ ఖానాలు నిర్మించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. గురువారం 16వ డివిజన్ గౌతమీ దోబీ ఖానాలో రూ.17.70 లక్షల వ్యయంతో వాటర్ ట్యాంక్ స్లైర్ కేసు, బోరు మరియు ఇతర ఆధునికీకరణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో మొట్టమొదటి ధోబి ఖానా ఇదేనని, అప్పట్లో తన హయాంలోని నిర్మించడం జరిగిందని గుర్తు చేశారు. బట్టలు ఉతకడం కోసం వాడే కొన్ని రకాల కెమికల్స్ వల్ల పైప్ లైన్ పాడై వాటర్ ట్యాంకు ద్వారా నీరు సరిగా అందక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వీటన్నింటిని ఆధునికీకరణ పనులు చేసేందుకు నిధులు మంజూరయ్యాయని అన్నారు. పాత బోరు రిపేరు చేయించడంతోపాటు మరొక నూతన బోరు ఏర్పాటు చేయాలని, పైప్ లైన్ మొత్తాన్ని పూర్తిగా మార్చివేయాలని, తక్షణమే పిచ్చి మొక్కలు, తుప్పలు శుభ్రం చేసి జంగిల్ క్లియరెన్స్ చేయాలని అవసరమైతే మరికొన్ని నిధులు కేటాయించేందుకు కృషి చేస్తానని తెలిపారు. స్థానిక మహిళలందరూ రజకులందరికీ ప్రత్యేక నివాస స్థలాలు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై గోరంట్ల స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి రజకుల సమస్యలను తీసుకువెళ్లి ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేసేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ దాలిపర్తి వేమన, రజక సంఘం అధ్యక్షులు బొమ్మదేవర శ్రీనివాస్, అంతర్వేది ప్రభాకర్‌రావు, వుల్లూరి వెంకటేశ్వరరావు, నందమూరి శ్రీనివాస్, కోటి, ఏడాకుల వెంకటేశ్వరరావు, కుంచె హనుమంతరావు, చలమూరి సత్యనారాయణ, శీలం గోవిందు, పల్లి సాయి, సింగవరపు సత్యనారాయణ, అడపా వరప్రసాద్, కొమ్మన శ్రీనివాస్, సుబ్బాయమ్మ, వాసుపల్లి అనంతలక్ష్మి పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి

నిరుపేదలకు ప్రభుత్వమే గృహాలు నిర్మించాలి


ప్రజాశక్తి - ఉండ్రాజవరం

నిరుపేదలకు ప్రభుత్వమే గృహాలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని పలువురు ఎంపిటిసిలు కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చివటం ఎంపిటిసి వేముల వెంకటసత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం అందజేసిన స్థలంలో సొంత ఇంటిని నిర్మించుకోవడానికి ఆర్థిక స్తోమత లేని నిరుపేద లబ్ధిదారులకు ప్రభుత్వం ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. దమ్మెన్ను సర్పంచ్ గురజర్ల వీరవెంకట సత్యనారాయణ మాట్లాడుతూ తమ గ్రామంలో 2008లో ప్రభుత్వం పంపిణీ చేసిన ఇంటి స్థలాలలో అవకతవకలు జరిగాయని, లబ్ధిదారులను సర్వే చేసి, అర్హులకు మాత్రమే పంపిణీ చేయాలనికోరారు. ఈ సమావేశంలో సర్పంచ్‌లకు తమ గ్రామాలకు సంబంధించిన సమస్యలను ప్రస్తావించడం, ఎంపిటిసి ద్వారా వివరించడం మినహా, ప్రశ్నించే అర్హత లేదని ఎంపిపి అన్నారు. గతాన్ని వదిలిపెట్టి, ప్రస్తుత కాలానికి రావాలని ఈ ఎంపికలో లబ్ధిదారులకు నష్టం లేకుండా చూడాలని సర్పంచ్‌కు సూచించారు. పాలకపక్షంలో ఉన్నప్పటికీ ప్రజల పక్షాన మాట్లాడాల్సిన బాధ్యత తమకుందని ఎంపిటిసి తెలిపారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు ఎఎంసి ఛైర్మన్ గాలింకి జిన్నాబాబు, తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్, ఎంపిడిఒ ఎం.శ్రీనివాసరావు, ఎంపిటిసిలు, సర్పంచులు, పలు శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి

కార్టూ'నిజం'



పంచాయతీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని నడిపల్లి పంచాయతీని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసేందుకు దృష్టి సారించి పనులు చేపట్టడం జరుగుతుందని సర్పంచ్ బీర సత్యవేణి అన్నారు. గురువారం గ్రామంలో చేపట్టిన సిసి రోడ్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా నడిపల్లి పంచాయతీ ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో మంత్రి కందుల దుర్గేష్, స్కిల్ డవలంప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు సహకారంతో గ్రామంలో పలు సిసి రోడ్లను నిర్మిస్తున్నట్లు చెప్పారు. గ్రామానికి ఉపాధి హామీ చట్టంలో రూ.78 లక్షలతో ఎస్‌సి, బిసి, ఒసి ప్రాంతాల్లో సిసి రోడ్లు నిర్మాణం చేపట్టినట్లు ఎలిపారు. నడిపల్లి, నడిపల్లి కోట ప్రాంతాల్లో రూ.49 లక్షలతో 16 సిసి రోడ్లు, అలాగే రూ.29 లక్షలతో 11 సిసి రోడ్లు వేస్తున్నామన్నారుజ పార్టీలకు అతీతంగా గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు చెప్పారు. ఈ పర్యటనలో కూటమి పార్టీల నాయకులు చిట్టూరి వెంకటనారాయణ, బూరుగుపల్లి రాము, పులా సత్తిబాబు, ఉప సర్పంచ్ అన్నమారెడ్డి రవీంద్రనాథ్ చౌదరి, పంచాయతీరాజ్ ఎఇ భావన్ నారాయణ, గ్రామ ఇంజనీరింగ్ అసిస్టెంట్ డి.శాంతకుమారి పాల్గొన్నారు.



సిసి రోడ్డు పనులను కొబ్బరి కాయ కొట్టి ప్రారంభిస్తున్న సర్పంచ్ బీర సత్యవేణి



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ సాయిప్రసాద్

సమగ్ర సర్వేను పూర్తి చేయాలి

ప్రజాశక్తి - గోపాలపురం

ఒక కుటుంబంలోని ఓటర్లు అందరూ ఒకే చోట ఓట్లు ఉండేలా సమగ్ర సర్వేను పూర్తి చేయాలని తహశీల్దార్ ఎంవి.సాయిప్రసాద్ ఆదేశించారు. గురువారం స్థానిక వెరెన్యూ కార్యాలయంలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ లెవెల్ అధికారులు, బిఎల్ఒలు కలిసి సమగ్రంగా సర్వేను పూర్తి చేయాలని అన్నారు. తల్లిదండ్రులు, పిల్లలు ఒకే ఇంటి నెంబర్ ఒకే చోట ఓట్లు ఉండేట్లు 2002 ఓటరు లిస్ట్‌తో పోల్చి అప్పటి ఓటర్ల పిల్లలను వారి కుటుంబ సభ్యులను కలిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 11వ తేదీ లోపు ఈ సర్వేను పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో సూపర్‌వైజర్లు, ఎన్నికల సీనియర్ సహాయకులు నల్లరాజు, జోడాల వెంకట్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫాం అందజేత

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని వంగలపూడి జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు పెందుర్తి సేవాసమితి ఆధ్వర్యంలో టిడిపి యువ నాయకుడు పెందుర్తి అభిరామ్ స్పోర్ట్స్ యూనిఫాంను అందజేశారు. తొలుత మాజీ ఎంఎల్ఎ పెందుర్తి వెంకటేష్ ప్రస్తుతం ముఖ్యమంత్రి ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా ఏడాది కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా టిడిపి నాయకుడు గద్దే సురేష్ గృహం వద్ద కేక్ కటింగ్ చేసి వెంకటేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అభిరామ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి పెందుర్తి కుటుంబం రుణపడి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసికొంచా చంద్ర భాస్కరరావు, ఎస్ఎంసి ఛైర్మన్ తవిటికి కృష్ణ, టిడిపి నాయకులు గద్దె సురేష్, మద్దిపాటి సత్యనారాయణ, గోలి శ్రీనివాసరావు, దుద్దుపూడి సత్యనారాయణ, సూరెడ్డి సర్వేశ్వరరావు, యనమదల వెంకట రామారావు, తదితరులు పాల్గొన్నారు.



స్పోర్ట్స్ దుస్తులు అందజేస్తున్న అభిరామ్

తోట బాబుకు ఘన నివాళి

ప్రజాశక్తి - కడియం

పిడింగొయ్యి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ అకాల మరణం చెందిన గానగళ్ళ తోట బాబుకు ఘనంగా నివాళు లర్పించారు. గురువారం వేమగిరి పుష్కర మాత వృద్ధాశ్రమంలో తోటబాబు 6వ వర్ధంతిని నిర్వహించారు. తోటబాబు సతీమణి జ్యోతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వృద్ధులకు నూతన వస్త్రాలతో పాటు, భోజనం సదుపాయాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులతో పాటు, స్నేహితులు పాల్గొన్నారు.



భోజనాలు వడ్డిస్తున్న తోటబాబు కుటుంబ సభ్యులు

డిడిఒ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - కొవ్వూరు

కొవ్వూరు పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు గురువారం ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 77 డిడిఒ కార్యాలయాలను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వర్చువల్ రూపంలో ప్రారంభించారు. డిఎల్‌పిఒ, ఎపిడి కార్యాలయాలు ఒకే ప్రాంగణంలో ప్రారంభించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఇఇ కార్యాలయం భీమవరం తరలివెళ్లడంతో ఆ భవనాలను పునరుద్ధరించి డిడిఒ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ భవనాన్ని మండల పరిషత్ నిధులు రూ.19 లక్షల వ్యయంతో పునరుద్ధరించినట్లు ఎంఎల్ఎ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంటమణి రామకృష్ణ, ఎంపిపి కాకర్ల నారాయుడు, ఎఎంసి ఛైర్మన్ నాదెండ్ల శ్రీరామ్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ సూరపనేని చిన్ని, డిడిఒ ఎ.స్లివారెడ్డి, ఆత్మ మాజీ ఛైర్మన్ సుంకర త్రిమూర్తులు, అధికారులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ ముప్పిడి

రహదారి భద్రతపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రూరల్ మండలం పిడుంగొయ్యి గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రహదారి భద్రతపై గురువారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. స్థానిక పిడింగోయ్యి ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి గ్రామంలో కాలుష్య నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ హెచ్.శ్రీరామ్‌పవన్, పాఠశాల హెచ్ఎం సుజాత, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న వాలంటీర్లు

శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిరంతర కృషి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసు యంత్రాంగం నిరంతర కృషి చేస్తుందని ఎస్‌పి డి.నరసింహాకిషోర్ అన్నారు. గురువారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటనను విడుదల చేశారు. గత సంవత్సర కాలంగా ప్రజలకు బాధ్యతాయుతమైన సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. శాంతి భద్రతలు కాపాడడంలో ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారంతో ముందుకు సాగుతున్నామని అన్నారు. టెక్నాలజీని ప్రవేశపెట్టి నేరాలను అరికట్టగలుగుతున్నామని వివరించారు. ప్రజల భాగస్వామ్యంతో 5000 సిసి కెమెరాలు ఏర్పాటు చేసి, 17 డ్రోన్‌లతో నిరంతరం నిఘాను కొనసాగిస్తున్నట్లు చెప్పారు. దీనివల్ల నేర నియంత్రణతో పాటు ప్రజలు పాల్గొనే పండుగలు, ఉత్సవాలు మరియు ఊరేగింపులను శాంతి యుతమైన వాతావరణంలో జరుగుతున్నట్లు చెప్పారు. ఎస్‌పి శాఖపై ఉద్దేశపూర్వకంగా అవినీతి ఆరోపణలు చేస్తున్నారని, తద్వారా పోలీసుల మానసిక స్థైర్యాన్ని దెబ్బ తీయడం సరికాదన్నారు. అవినీతి ఆరోపణలపై ప్రజలు ఆధారాలతో ఫిర్యాదు చేస్తే విచారణ చేసి ఆధారాలు నిరూపణ అయితే వారిపై చర్యలకు వెనకాడేది లేదన్నారు. జూదం, కోడిపందాలు, అశ్లీల నృత్యాలు, వేశ్యా కార్యకలాపాలపై ఖచ్చితమైన సమాచారం ఇస్తే, చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా కొత్తగా 317 మంది వ్యక్తులపై రౌడీ షీట్స్ ఓపెన్ చేసినట్లు చెప్పారు. 19 మందిపై పీడీ యాక్ట్‌ను నమోదు చేశామన్నారు. 432 రౌడీలను బైండ్ ఓవర్ చేయడం జరిగిందన్నారు. నేరాల నియంత్రణలో భాగంగా 114 మందిపై సస్పెక్ట్ షీట్లు ఓపెన్ చేశామని తెలిపారు. శాంతి భద్రతలు మరియు నేరాల నియంత్రణలో భాగంగా ప్రతీ పోలీస్ స్టేషన్ పరిధిలో నైట్ బీట్‌లు, డే బీట్ లు, నైట్ పెట్రోలింగ్, నైట్ స్పెషల్ పార్టీ టీంలతో విస్తృతంగా గస్తీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమాజంలో ఉన్న ప్రతిఒక్కరూ పోలీసులకు సహకరించాలని సూచించారు. ప్రజలందరికీ పోలీసు శాఖ అన్నివేళలా అందుబాటులో ఉంటుందని, ఎటువంటి ఆపదలోనైనా ప్రజలు పోలీసులను సంప్రదించవచ్చునని అన్నారు. శాంతి భద్రతలు ఎల్లవేళలా కాపాడుతూ, నేరాలను నియంత్రిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు.

నేరాలు - ఘోరాలు

అదృశ్యమైన బాలిక మృతి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన మల్లి సాత్విక (10) సోమవారం సాయంత్రం అదృశ్యం అయింది. ఆ రోజు నుంచి ఆమె ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతుకుతున్నారు. ఎంతకూ బాలిక ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే గ్రామంలో ఉన్న రావిచెట్టు రేవులో ఆ బాలిక మృతదేహం ఉన్నట్లు గురువారం స్థానికులు గుర్తించారు. పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకుని బాలిక మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - నల్లజర్ల

పుల్లలపాడుకు చెందిన ఆరేపల్లి సోమరాజు విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పుల్లలపాడు గ్రామానికి చెందిన సోమరాజు పామాయిల్ గెలలు కోసేందుకు ప్రకాశరావుపాలెం గ్రామ రైతు గద్దె సత్యనారాయణ కూలికి వెళ్లాడు. గెలలు కోస్తూ ఉండగా విద్యుత్ వైర్లకు ఐరన్ పైపునకు ఉన్న కత్తి తగలడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆంజనేయ స్వామి ఆలయంలో చోరీ

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఆంజనేయస్వామి ఆలయంలో బంగారం వస్తువులు, వెండి ఆభరణాలు చోరీపై గురువారం పోలీసులకు కేసు నమోదు చేశారు. మండలంలోని కట్టుంగ గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఈనెల 2వ తేదీ అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం తలుపులు పగలగొట్టి స్వామి వారి వెండి ఆభరణాలు, బంగారం వస్తువులు దొంగిలించారు. దీనిపై ఆలయ నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ రాము తెలిపారు.



ప్రమాదంలో ధ్వంసమైన వాహనం

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తల మృతి

ప్రజాశక్తి - రాజానగరం

ప్రేమ వివాహం చేసుకున్న ఏడాదిన్నరకే రోడ్డు ప్రమాదంలో అశువులు బాశారు. రాజానగరం జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలు మృతి చెందగా, వారికి జన్మించిన మూడు నెలల చిన్నారి అనాథగా మారింది.

మండలంలో నందరాడకు చెందిన జుత్తుక లిలాప్రసాద్(21), బొమ్మూరు బర్మా కాలనీ చెందిన సురేష్ సోమియా(20) ఏడాదిన్నర క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీళ్లకు మూడు నెలల ఆడపిల్ల పుట్టింది. గురువారం మధ్యాహ్నం మోటారు సైకిల్‌పై రాజానగరం బ్యాంకు నుంచి ఇంటికి వెళుతుండగా జాతీయ రహదారి మధ్యలో నరేంద్రపురం సెంటర్లో కుడివైపు ఆగి ఉన్నారు. రాజమహేంద్రవరం నుంచి విశాఖపట్నం వైపు వెలుతున్న సిమెంట్ లోడ్ లారీ ఎడమవైపు ద్విచక్రవాహనాన్ని తప్పించే ప్రయత్నంలో రోడ్డుకు కుడివైపు ఆగివున్న ఈ దంపతులను ఢీకొట్టింది. దీంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. ఎడమవైపు స్కూటీపై వెళ్తున్న గాదరాడకు చెందిన బొడ్డు వెంకటలక్ష్మి, సొమ్మంగి వీరలక్ష్మి గాయాలపాలయ్యారు. వీరిని 108లో ఆసుపత్రికి తరలించారు. మతదేహాలను పోస్టుమార్టం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బాలుని అప్పగిస్తున్న పోలీసులు

తప్పిపోయిన బాలుని అప్పగింత

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట గోలివారి వీధికి చెందిన బాలుడు ఏనాపు జగదీష్ గురువారం అమ్మమ్మ శేషరత్నంతో కలిసి స్టేషన్ సెంటర్ రింగ్ సెంటర్‌లోని సాయిబాబా ఆలయానికి వెళ్లాడు. జగదీశ్ అక్కడి నుంచి కనిపించకుండా పోవడంతో అమ్మమ్మ, తల్లి శ్రీదేవి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ, సిబ్బంది స్పందించి చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. అనంతరం భీమేశ్వరాలయం వద్ద బాలుడు జగదీష్‌ను గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి బాలుని సురక్షితంగా గుర్తించిన పోలీసు సిబ్బందిని ఎస్‌పి జి.బిందు మాధవ్, డిఎస్‌పి శ్రీహరి రాజు అభినందించారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని గుర్రంపాలెంలో గురువారం పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురిని అరెస్టు చేసినట్లు సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు. ఎస్ఐ రఘునాథరావు, సిబ్బంది పేకాడుతున్న వారిని అదులోనికి తీసుకుని వారి వద్ద నుంచి రూ.10,050 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై జరిమానా, జైలు

ప్రజాశక్తి- తాళ్లరేవు

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ఆరుగురికి రూ.60 వేల జరిమానా, రెండు రోజుల జైలు శిక్ష విధించినట్టు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. మద్యం సేవించి వాహనం నడిపితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - కొవ్వూరు

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవి.రమణ డిమాండ్ చేశారు. గురువారం ప్రయివేటు ఎలక్ట్రికల్ అండ్ ప్లంబింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. ఈ ధర్నాలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు తీరని అన్యాయం చేసిందన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును నిలుపుదల చేయడంతో అనేక మంది కార్మికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారని అన్నారు. ఎన్నికల సమయంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని హామీలు ఇచ్చిన కూటమి పార్టీల నేతలు అధికారంలోకి వచ్చాక ఏమాత్రం పట్టించుకోక పోవడం దారుణమన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 15న నిర్వహించే చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రొంగల హరీష్ పి.నాగేశ్వరరావు, ఈమని గ్రీష్మ కుమార్, న్యాయవాధి నంబూరి శ్రీమన్నారాయణ, ఈమని మల్లిక, పద్దాల వెంకన్న, మరపట్ల శ్రీనివాస్, వి.రాజేష్ పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న భవన నిర్మాణ రంగ కార్మికులు

బిఎస్ఎన్ఎల్‌ను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్వదేశీ నెట్‌వర్క్ కలిగిన బిఎస్ఎన్ఎల్‌ను ప్రోత్సహించాలని బిఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ పలివెల రాజు పిలుపునిచ్చారు. గురువారం రాజమహేంద్రవరం నగరంలో బిఎస్ఎన్ఎల్ క్యాంపెయన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం సొంతంగా తయారు చేసిన టెక్నాలజీని వినియోగించడం ద్వారా పూర్తి భద్రత వినియోగదారులకు లభిస్తుందని తెలిపారు. అలాగే ఫైబర్ నెట్ ద్వారా హై స్పీడ్ ఇంటర్నెట్ ద్వారా ఇంట్లో సర్విలియన్స్ కెమెరాలు పెట్టుకోవచ్చునని అన్నారు. స్మార్ట్ టీవీలు వాడుకోవచ్చునని తెలిపారు. ఎయిర్‌టెల్, జియో నెట్‌వర్క్‌లతో పోలిస్తే బిఎస్ఎన్ఎల్ సిమ్ లేదా టారిఫ్‌లు, రీఛార్జిలు తక్కువగా ఉంటాయన్నారు. ప్రస్తుతం ఫ్రీడం ప్లాన్ పేరుతో ఒక రూపాయికే సిమ్ ఇస్తున్నారని తెలిపారు. నెలరోజుల పాటు ఫ్రీ టాక్ టైం ఫ్రీ డేటా ఉంటుందని రోజుకి 2జిబి డేటా వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రదర్శన నిర్వహిస్తున్న బిఎస్ఎన్ఎల్ అధికారులు, సిబ్బంది

పొంచి ఉన్న ప్రమాదం...

ప్రజాశక్తి - కడియం

కడియం ప్రభుత్వ మత్స్య సంపద కేంద్రం వద్ద గల క్వారీ కాలువకు ఒక పక్క రక్షణ గోడ లేక, కనీసం రైలింగ్ లేకుండా ప్రమాదకరంగా దర్శన మిస్తుంది. గోదావరి తూర్పు డెల్టా ప్రధాన కాలువ రోడ్డు కింది భాగం నుంచి ప్రవహించే ఈ క్వారీ కాలువ కడియం ఆవ మీదుగా రాజవోలు చేరుకుంటుంది. సుమారు రూ.2 వేలు ఎకరాల్లో ఆయకట్టుకు సాగునీరు అందిస్తుంది. ఈ రోడ్డు మీదుగా ప్రతి రోజు పదుల సంఖ్యలో ఆర్‌టిసి బస్సులు, వందలాది వాహనాలు, వేలాది ద్విచక్రవాహనాలు, స్కూల్ బస్సులు, ఆటోలు తిరుగుతుంటాయి. ప్రతి రోజు స్థానిక పరిశ్రమల్లో పనిచేయు వందలాది మంది కార్మికులు ప్రమాదం అంచున రాకపోకలు కొనసాగిస్తున్నారు. వాహనాలు ఎదురు పడ్డ సందర్భాల్లో ద్విచక్ర వాహన దారులు, ప్రయాణికులు, తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి కళ్ల ముందు కనిపిస్తున్నా సంబంధిత అధికారులుగానీ, ప్రజాప్రతినిధులు గానీ కనీసం స్పందించిన దాఖలాలు లేవు. కడియం ఆవ రైతులు, రాజవోలు తదితర గ్రామాల ప్రజలు, రైతులు నిత్యం పగలు, రాత్రిళ్ల ఈ ప్రమాదం చెంతన రాకపోకలు కొనసాగిస్తారు. రైతులను దృష్టిలో పెట్టుకుని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలని ఆవ రైతులు కోరుతున్నారు.



రైలింగ్ కూడా లేకుండా ఉన్న వంతెన

బొండు మట్టి బొక్కేస్తున్నారు..

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని ఖండవల్లి పంచాయతీ పరిధిలోని లంకమాలపల్లి గోదావరి నుంచి బొండి మట్టి ఇసుకను కొందరు బొక్కేస్తున్నారు. గత కొన్ని రోజులుగా రాత్రి పగలు తేడా లేకుండా ఎటువంటి అనుమతులు లేకుండా బొండు మట్టి బొక్కేస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదు. ఇటుక తీసే నల్ల మట్టి లో కలపటానికి గోదావరి బొండు మట్టిని వినియోగిస్తున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా యంత్రాలతో తవ్వి లోడ్ చేసి ట్రాక్టర్లు, లారీలపై బొండు మట్టి ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. అక్రమంగా తరలిస్తున్న బొండు మట్టి ఇసుక తవ్వకాలను నిలుపుదల చేయాలని స్థానికులు కోరుతున్నారు.



ట్రాక్టర్‌తో తరలించుకుపోతున్న బొండ్డు మట్టి

ట్రస్ట్ ద్వారా విద్యార్థినికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణంలో స్థానిక బొజ్జా వారి తోటలో వున్న లిటిల్ స్టార్ రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ కార్యాలయంలో గురువారం విద్యార్థినికి రూ.20 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు కరుణ్ రాజు (కామేశ్వరరావు) మాట్లాడుతూ స్థానిక మోహన్ నగర్‌కు చెందిన ఎం.కల్యాణి చదువుకునేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడుతోందని తమ ట్రస్ట్ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో తమకు తెలిసిన ఎస్.రమ్య, చంటి, దంపతుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్ళడంతో వారు స్పందించి విద్యార్థిని చదువుకు ఇబ్బంది కలాగకూడదని తమ వంతు రూ.15 వేల ఆర్థిక సాయం అందించినట్టు తెలిపారు. మరొక దాత రూ.5000 ట్రస్ట్‌కు అందజేశారన్నారు. మొత్తం రూన.20 వేల చెక్కును విద్యార్థినికి అందజేశామన్నారు. ట్రస్ట్ తరపున ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, భవిష్యత్తులో మరింత మందికి సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఇటువంటి విద్యార్థులకు సాయం చేయదలచిన వారు తమ ట్రస్టుని సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు గౌరవాధ్యక్షురాలు టి.రాధ, ట్రస్టు సభ్యులు టి.కృపారాణి, ట్రస్టు డైరెక్టర్ టి.బ్యూలాగ్రేస్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

బాలల చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-కాకినాడ

బాల్య వివాహ ముక్త్ భారత్ 100 రోజుల కాంపెయిన్‌లో భాగంగా చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 ఆధ్వర్యంలో స్థానిక జగన్నాథపురంలోని సత్యదేవ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ వి.అనంత లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహ ముక్త భారత్ కాంపెయిన్‌లో భాగంగా 27 నవంబర్ 2025 నుంచి 16 మార్చి 2026 వరకూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దేశంలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బాల్య వివాహాల నుంచి బాలలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడుపై ఉందన్నారు. బాలలను స్నేహ పూరిత వాతావరణంలో తీర్చి దిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. బాల్య వివాహాలు బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధికి ఆటంకమే కాక వారి కలలను సాకారం చేసుకునే అవకాశాలను దూరం చేస్తోందన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా సాధ్యమైన ప్రతి ప్రయత్నం చేయాలన్నారు. బాల్య వివాహం చేయడానికి చేసిన ఏ ప్రయత్నాన్నైనా పంచాయతీ, ప్రభుత్వ అధికారులకు తెలియపరచాలని అన్నారు.



ఆశ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న వైద్యులు

అసంక్రమిత వ్యాధులపై శిక్షణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో యోస్‌ఎయిడ్ ఇన్నోవేషన్ ఫౌండేషన్‌తో భాగస్వామ్యం ద్వారా అసంక్రమిత వ్యాధులపై శిక్షణా కార్యక్రమం ప్రారంభం అయింది. గురువారం ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలోని ఒక ప్రయివేటు సమావేశం మందిరంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని డిఎంహెచ్ఒ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్‌సిడి కార్యక్రమం అధికారి డాక్టర్ హరిచంద్రప్రసాద్ ఆధ్వర్యంలో డాక్టర్ రేష్మా, డాక్టర్ సందీప్, డాక్టర్ హేమంత్, డాక్టర్ కార్తిక్ హైపర్‌టెన్షన్, డయాబెటిస్, నోరు, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ వంటి అసంక్రమిక వ్యాధులపై శిక్షణ ఇచ్చారు. స్థానిక ఆరోగ్య సమస్యలను ప్రజలే గుర్తించి, ప్రమాద కారకాలను అర్థం చేసుకుని, వాటిని అరికట్టేందుకు అవసరమైన వ్యూహాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు రెండు రోజులు, ఆశ కార్యకర్తలకు నాలుగు రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు డిఎంహెచ్ఒ తెలిపారు.

ఆదమరిస్తే అంతే సంగతులు..

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్

మండలంలోని తాళ్లపాలెం గ్రామంలోని ఆర్ అండ్ బి రహదారిపై ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా ఉంది. ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలోని ఆర్ అండ్ బి రహదారిలో కల్వర్టు నిమిత్తం తూరలు ఏర్పాటు చేశారు. ఈ రహదారిపై సింగవరం, తాళ్లపాలెం గ్రామాల మీదుగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. భారీ వాహనాల రాకపోకలతో తూరలు శిధిలమయ్యాయి. దీంతో రహదారిలో పెద్ద గొయ్యి ఏర్పడింది. ఆ గోతిలో ప్రమాద సూచికలు పెట్టి అధికారులు చేతులు దులుపేసుకున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో గొయ్యి మరింత పెద్దదయింది. అయినా సంబంధిత శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శస్తున్నారు. రాత్రి సమయాల్లో ద్విచక్రవాహనదారులు ఆ గోతిలో పడి గాయాలపాలవుతున్నారు. తక్షణమే గోయ్యిని పూడ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ఆర్ అండ్ బి రోడ్డులో కూలిపోయిన కల్వర్టు

సిసి రోడ్డు నిర్మాణం పట్ల హర్షం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని చిన్నకొండేపూడి కొత్త పేటలో సిసి రోడ్డు నిర్మాణం చేయడం పట్ల న్యాయవాధి చిడిపి వీర్రాజు హర్షం వ్యక్తం చేశారు. గురువారం సిసి రోడ్డు నిర్మాణం పనులను స్థానికులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబు జగజీవన్ రామ్ నగర్, అంగన్ వాడీ సెంటర్ వీధిలో రహదారి సరిగ్గా లేక వర్షకాలంలో ప్రజలు నానా ఇబ్బందులు పడేవారని అన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని 15వ ఆర్థిక సంఘ నిధులతో సిసి రోడ్డు నిర్మాణం చేయడం సంతోషకరమన్నారు. దళిత వాడల్లో సిసి రోడ్డు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో చిడిపి శేఖర్, కొడమంచిలి వీరయ్య, కొల్లి పండు, చిడిపి శ్రీను, చిడిపి సత్యానందం, చిడిపి గోపి, గంధం పోసియ్య, చిడిపి దావీదు పాల్గొన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - నల్లజర్ల

ప్రయివేటు ఆసుపత్రుల్లో వైద్య చేయించుకుని ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్న వారికి సిఎం సహాయ నిధి నుంచి విడుదలైన చెక్కులను బాధితులకు ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోపాలపురం నియోజకవర్గానికి సిఎంఆర్‌ఎఫ్ 21వ విడతగా రూ.20.72 లక్షలను 35 మందికి మంజూరు చేశారని అన్నారు. బాధిత కుటుంబాలకు సిఎంఆర్‌ఎఫ్ ఆర్థిక భరోసా కల్పిస్తుందన్నారు. పేదల కోసం కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సిఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి -కరప

కరపలో ఇటీవల మరణించిన కసింకోట ఆనందరావు కుటుంబానికి సుందరనీడి రాజబాబు రూ.2 వేలు విలువ చేసే నిత్యావసర సరుకులు అందజేశారు. వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం పోలిశెట్టి తాతీలు ద్వారా తెలుసుకున్న సూరపురెడ్డి సురేష్, గురువారం అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఉప్పలగుప్తం మండలం కూనవరం గ్రామానికి చెందిన సుందరనీడి రాజబాబు తన భార్య పుట్టినరోజు సందర్భంగా నిత్యావసర వస్తువులను తాతీలు ద్వారా అందజేశారు. దాతకు ఆనందరావు కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.

యానాం వార్తలు

ఉచిత దుస్తులకు బదులు నగదు

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ప్రభుత్వం ఆది ద్రావిడ వెల్ఫేర్, షెడ్యూల్ ట్రైబ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ద్వారా సంక్రాంతి పండుగకు ఇచ్చే ఉచిత దుస్తులకు బదులు నగదు జమ చేయనున్నట్లు ఆ శాఖ అధికారి కె.రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 18 ఏళ్లు నిండిన వారు తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డ్, బ్యాంక్ ఎకౌంట్, వయసు నిర్ధారణ సర్టిఫికెట్లు కాపీలను ఈ నెల 8 లోగా కార్యాలయంలో సమర్పించాలని కోరారు. యానాంలో నివసించే షెడ్యూల్ కాస్ట్‌కు చెందిన కుటుంబ సభ్యుల వివరాలు కార్యాలయంలో నమోదు చేసుకోవాలన్నారు.

యానాం సివిగా షణ్ముగ సుందరం

ప్రజాశక్తి - యానాం

యానాం సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా పి.షణ్ముగ సుందరంను నియమిస్తూ పుదుచ్చేరి భద్రతా విభాగం ఎస్‌పి చింతా కోదండరామ్ ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటి వరకు ఆయన సిగ్మా సెక్యూరిటీ సివిగా బాధ్యతలు నిర్వహించారు. త్వరలో యానాం సివిగా బాధ్యతలు చేపట్టనున్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

ముగిసిన విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలు

ప్రజాశక్తి - యానాం

స్థానిక పిఎంశ్రీ రాజీవ్ గాంధీ గవర్నమెంట్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో యానాం విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 2 నుంచి 4 వరకూ విద్యార్థులచే నిర్వహించిన విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలు గురువారంతో ముగిశాయి. ముగింపు వేడుకల్లో ఇన్‌చార్జి పరిపాలనాధికారి,ప్రభుత్వ ఆసుపత్రి డిడి రవిశంకర్ పాల్గొని విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆయా పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన వివిధ అంశాలు అద్భుతంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్, ఎడిపిసి కమిడి ప్రభాకర్ రావు, జి.రత్నప్రభ, సుందరి, త్రిమూర్తులు పాల్గొన్నారు.